
నూరేళ్ళ తెలుగు కథకు

**నవ్య నీరాజనం - 80**



# హద్దులు లేని ఆకాశం సరిహద్దులు లేని సాహిత్యం రెండూ ఒకటే!

**- జాతశ్రీ**

గ్లోబలైజేషన్ పరిణామాల్లో...మన పల్లెల్లో వృత్తులు ఆధారంగా బతుకుతున్నవారి నిస్సహాయతల్నీ, నిట్టూర్పుల్నీ, నిబద్ధతతో పరిశీలిస్తూ పాఠకుల్లో ఆలోచనలు రేకెత్తించేలా కథలు రాస్తున్న తెలంగాణా రచయితల్లో జాతశ్రీ ఒకరు. వస్తు వినియోగ సంస్కృతిని పెంచి, పోషిస్తున్న సంస్కరణల వల్ల కలిగిన వెసులుబాటులో బహుళజాతి సంస్థల వస్తు సముదాయపు వెల్లువలో గ్రామీణ వృత్తి పనివారలు, కళాకారులు, దిక్కుతోచని స్థితికి నెట్టబడ్డారు. వారి బతుకుల్నీ, భవిష్యత్‌నీ ఆదుకునే చర్యలేవీ ప్రభుత్వం గానీ, ప్రజాప్రతినిధులుగానీ చేపట్టడం లేదు. ఆ భయానక కథా విషాదాల్ని అక్షరంతో అక్షయంగా మారుస్తున్న రచయిత జాతశ్రీతో ఇంటర్వ్యూ ఈ వారం...

## స్నేహాలకు వందనం...

నా వారసత్వం గానీ, నేను పెరిగిన వాతావరణం గానీ, నా సాహితీ పిపాసకు దోహదపడలేదు. సెకండరీ స్థాయిలో నేను దొంగచాటుగా చదివిన డిటెక్టివ్ సాహిత్యం నాలో పఠనాభిరుచిని పెంచగా, ఆ తర్వాత రోజుల్లో ఏర్పడిన 'కలం స్నేహాలు' నాలో రచనాభిలాషను కలిగించాయి. ముఖ్యంగా శ్రీయుతులు బి.పి.కరుణాకర్, శ్రీపతి, గుమ్మా ప్రసన్నకుమార్, మజుందార్, శీలా వీర్రాజు తదితర ప్రఖ్యాత రచయిత లెందరెందరో....రచనాపరంగా ఎన్నెన్నో మెళకువలు చెప్పారు. ఆ అపు రూప నిస్వార్థ స్నేహాలకు రెండు చేతులూ జోడిస్తున్నాను.

## కృష్ణవేణీ తరంగాలలో

నల్గొండ జిల్లా మఠంపల్లి మండలంలో కృష్ణానదీ తీరాన ఉన్న గుండ్లపల్లి నా స్వగ్రామం. నా చిన్నతనంలో మా నాన్నగారక్కడ ఏకోపాధ్యాయుడు. కృష్ణవేణీ తరంగాలలో ఈదులాడుతూ, ఆటలాడుతూ నా ప్రాథమిక విద్యను మా నాన్నగారి దగ్గరే పూర్తి చేశాను. నాన్నగారి ఉద్యోగరీత్యా హుజూర్‌నగర్ తాలూకాలోని అనేక గ్రామాలతో నాకు పరిచయం కలిగింది. మఠంపల్లి వివేకవర్ధినీ విద్యాలయంలో నేను సెకండరీ విద్యా స్థాయి పూర్తి చేసే నాటికి నన్ను ప్రభావితం చేసిన వ్యక్తులు, మనసున నిలిచిన సంఘటనలు...నేను తొలినాళ్ళలో రాసిన కథలు! 1978లో విశాలాంధ్ర నవలల పోటీలో ద్వితీయ బహుమతి పొందిన 'బలిపశువు' నవలా నేపథ్యమూ అదే! కథలు ఎవరెలా రాస్తారో నాకు తెలీదుగాని, నేనైతే...నే చూసిన, నా మనసున నిలిచిన సంఘటనను, కథగా అక్షరీకరించాలనే తపనతో మరింత సమాచారాన్ని సేకరిస్తూ కొన్ని దినాలు...సంభాషణలతో సహ ప్రారంభాన్నీ, కథా గమనాన్నీ, ముగింపునూ నెమరేసుకుంటూ, తృప్తి కలిగాక రచనకుపక్రమిస్తాను. శిల్ప పరంగా తీసుకోవలసిన జాగ్రత్తలూ మనసున ముద్రించుకొంటాను. నా స్వీయానుభవాన్ని బట్టి, నేను గ్రహించినంత వరకు కథా నిర్మాణం ఇతర సాహితీ ప్రక్రియల నిర్మాణాల కన్నా కష్టతరమైనది. ఇతర సాహితీ ప్రక్రియల్లో ఉన్న వెసులుబాటు కథా రచనలో కనిపించదు. ఏది ఏమైనా, ఆవేశం ఎంతున్నా కథకునికి నిశిత దృష్టితో కూడిన కథానుగుణా లోచనలు ఉండకపోతే కథ సాఫీగా సాగదని నా నమ్మకం!

## మధుర సాహితి

1964 నుంచి రచయితగా ఆలోచించడం, రాయడం, రాసింది నచ్చక చింపేయడం, కాగితాల ఖర్చు తప్ప చివరకేం మిగిలేది కాదు. అదే రోజుల్లో వేంసూరు (సత్తుపల్లి మండలం)లో శ్రీ బెల్లంకొండ లక్ష్మణసూరి అను కవి మిత్రుని పరిచయమయ్యాక, వారి నాన్నగారు బెల్లంకొండ చంద్రమౌళి శాస్త్రి గారు (తెలంగాణ తొలితరం కథకుల్లో ఒకరు) నన్ను దగ్గరగా తీసుకొని, నేను మరింతగా కృషి చేసేలా అనేక సలహాలు యిచ్చేవారు. ఆ తర్వాత ఉపాధ్యాయ శిక్షణ కొరకు 'మధిర'లో ఉండగా 60 పేజీలతో 'మధుర సాహితి' అనే లిఖిత మాసపత్రికను నిర్వహించాను. చిన్నపిల్లల చేష్టలనిపించవచ్చు గాని, నాలోని రచయిత ఎదగడానికి సహకరించిన చేష్టలవి! ఆ పత్రికకు ఎవరూ రచనలు పంపక పోయినా, సంపాదకీయం మొదలు 'ప్రజ' వరకు రకరకాల పేర్లతో నేనే రాసి, మధిర శాఖా గ్రంథాలయంలో ఉంచేవాణ్ణి.



శ్రీమతితో...

వేంసూరు నుండి మా నాన్నగారు చినమండవ గ్రామానికి బదిలీ అయ్యాక నేనూ చినమండవ చేరాను. మంచి గ్రామీణ వాతావరణం! ఓ ప్రక్క విశాలమైన ఇసుక తిన్నెల మధ్య ప్రవహించే మున్నేరు బాగుండేది. 1970లో ఆంధ్రప్రభ 'లక్ష్మి' అను నా తొలికథ ప్రచురించారు. 50 రూపాయలకు చెక్కూ పంపించారు. ఆశ్చర్యపోయాను. ఆ అనుభూతిలో విస్తృతంగా కథలు రాయడం, పోస్ట్ కొరకు ఎదురు చూడటం, నా మిత్రుల ఉత్తరాలకు ప్రత్యుత్తరాలు రాయడం నా దైనందిన కార్యక్రమం అయిపోయింది.



ఇనాక్, సినారె, లక్ష్మీపార్వతిలతో...

## బుచ్చిబాబు అభిమాన రచయిత

ప్రసిద్ధ కథకులు బుచ్చిబాబు గారి రచనా విధానాన్ని నేను అమితంగా యిష్టపడతాను. నా తొలి కథలన్నీ వారి కథలకు నకిలీల్లా ఉండేవి. ఆ వర్ణనలు, ఉపమానాలు తెలుగు భాషా ఔన్నత్యానికి హద్దులేవి అన్పించేది! అదే సందర్భంలో ఖమ్మం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో శరత్, చలం, రావిశాస్త్రి, కుటుంబరావు, గోపీచంద్, శ్రీపాద తదితర మహా రచయితల్ని కనుగొన్నాను. ఆ ప్రఖ్యాత రచయితల ప్రభావంతో అనుకరణ నుంచి పక్కకు జరిగి, స్వీయానుభవాల్ని, కథ


లుగా రాయడం ఆరంభించాను. కథకునిగా నాదను మార్గాన్ని వెదుక్కునే క్రమంలో నేను చాలా చాలా చిరాకు పడేవాణ్ణి! ఒక స్త్రీ పడే ప్రసవ వేదనను మరపించేలా వేదన పడేవాణ్ణి! ఉద్యోగాన్వేషణలో ఖమ్మం వస్తూ, పోతూ, ఖాళీ సమయాన్ని గ్రంథాలయంలో గడుపుతూ... బహుశా ఖమ్మం కేంద్ర గ్రంథాలయమే నాకు అందుబాటులో ఉండకపోతే రచయితగా మిగిలేవాణ్ణి కాదేమో అనుకొంటుంటాను. రకరకాల పత్రికలూ అక్కడే పరిచయ మయ్యాయి. పరిచయమైన ప్రతి పత్రికనూ నా కథతో పలుకరించాను.

### ఇష్టమైనవి

| | | |
|---|---|---|
| సినిమా | : | వెలుగు నీడలు |
| హీరో | : | అక్కినేని నాగేశ్వరరావు |
| హీరోయిన్ | : | సావిత్రి |
| సంగీత దర్శకుడు | : | ఎ.ఆర్.రెహమాన్ |
| గాయని | : | సుశీల |
| గాయకుడు | : | వందేమాతరం శ్రీనివాస్ |
| ఆహారం | : | చేప |
| నవల | : | చివరకుమిగిలేది |
| కథకుడు | : | బుచ్చిబాబు |
| మిత్రుడు | : | బి.పి.కరుణాకర్ (కథకుడు) |
| సినిమా పాట | : | పాడవోయి భారతీయుడా |
| కవి | : | కె.శివారెడ్డి |
| కవిత | : | కీ.శే.సావిత్రిగారి 'పాఠం ఒప్పజెప్పకపోతే' |
| నాటకం | : | మరో క్రిస్మస్ రావాలి |

### అభ్యుదయ రచయితల సంఘం

విశాలాంధ్ర ఉత్తమ నవలల పోటీలో నా మలి నవల 'వెదురు పొదలు నినదించాయి' ప్రఖ్యాత సాహితీవేత్త పురిపండా అప్పలస్వామి ద్వారా తృతీయ బహుమతి అందుకునే సందర్భంలో నవలలకు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించిన పూజ్యులు చాసోగారూ, ప్రసిద్ధ కథకులు కేతూ గారూ, విజయవాడ మోడ్రన్ కేఫ్‌లో యిచ్చిన సలహాలతో కథలు ఎలా రాయకూడదో తెలుసుకోవడం, మనసున దాచుకోవడం ఈనాటికీ మరుపురాని అనుభూతిగా మిగిలింది. అప్పుడే కీ.శే. మల్లిక్ గారితో పరిచయం నన్ను 'అరసం'లో క్రియాశీలిగా మార్చింది. అరసం అండ దండలతో 'ఈ దశాబ్ది నవల' రాష్ట్రస్థాయి సదస్సును ఖమ్మంలో నిర్వహించడం జరిగింది. ఆ మరు సంవత్సరమే 'సాహిత్యంలో స్త్రీ' రాష్ట్ర స్థాయి సదస్సును నిర్వహించడం...వేదాల్లో, పురాణాల్లో, ఇతిహాసాల్లో, ప్రబంధాల్లో, మత గ్రంథాల్లో, నాటి నవలల్లో, కథల్లో మీడియాలో మన సాహిత్యకారులు స్త్రీని ఏ విధంగా చిత్రీకరిస్తున్నారో, ఒక వ్యాస సంకలనం తీసుకురాగలిగాను. ఆ సమయంలో రాజమండ్రి నుంచి కీ.శే. సావిత్రి గారు అందించిన సహాయ, సహకారాలు యిప్పటికీ గుండెల్లో పచ్చిగానే ఉన్నాయి. 'తరతరాల సాహిత్యంలో స్త్రీ' అంటూ సావిత్రి గారు తీవ్ర కంఠ స్వరంతో వెలిబుచ్చిన అభిప్రాయాలు అప్పట్లో గొప్ప సంచలనాన్ని కల్గించాయి. ఆ తర్వాత రోజుల్లో 'స్త్రీవాదం' తెరపైకి వచ్చింది.



### రచనకు విరామం

1990 నుంచి పదేళ్లు కుటుంబ, ఉద్యోగ బరువు బాధ్యతల్లో రచనా వ్యాసంగాన్ని తగ్గించుకొన్నా, పఠనా వ్యాసంగాన్ని వదల్లేదు. ఏదో ఒక పుస్తకం చదవనిదే నిద్ర రాని స్థితిలో గడిపిన నేను నూతన శతాబ్ది నుంచి మళ్లీ కథలు రాయడం ఆరంభించాను. గత దశాబ్దిలో సంభవించిన పరిణామాల్లో వ్యవసాయం, గ్రామీణ వృత్తులు, కళలు, మానవ సంబంధాలు ఏ విధంగా మసక బారుతున్నాయో పసిగట్టగల వయసూ, మనసూ తోడై...నిర్వీర్యమైపోతున్న ఆ రీతుల్ని చిత్రీకరించ ప్రయత్నిస్తున్నాను.

### కథలు ఎలా ఉండాలో శాసించడం నచ్చదు

కథ ఇలా ఉండాలి, అలా ఉండాలి అని శాసించేవాళ్లు, కథలకు గిరిగీస్తూ అయ్యవారి అవతారం ఎత్తేవాళ్లు కథా సాహిత్యానికి చేస్తున్న అపచారం క్షమార్హం కాదని నా అభిప్రాయం!

కథనెలా రాయాలనిపిస్తుందో, అలానే రాసే అవకాశం రచయితకు యివ్వాలి! సమాజాన్ని గమనిస్తూ తాను గ్రహించిందీ, విన్నదీ, కన్నదీ, కథగా రాయడం వల్ల కలిగే తృప్తి అతను మరింతగా ఎదగడానికి దోహద పడుతుంది. కథకులకు గురువులుండరు. రచనాభిరుచి ఉన్నప్పుడు రచయిత ఆసక్తులూ, అనుభవాలూ అతన్ని తీర్చిదిద్దుతాయి. స్వేచ్ఛలో ఎదిగే సాహిత్యం జీవితానికి చాలా దగ్గరగా ఉంటుందని నా విశ్వాసం!

### హద్దులు లేని ఆకాశం

ఈ నాటి కథకులు జీవితాలకు చాలా దగ్గరగా ఉండే గొప్ప కథలను సృష్టిస్తున్నారని చెప్పడానికి వెనుకాడను. అయితే ఏ కాలంలోనూ వంద శాతం ఉత్తమ కథలు రావు. కొన్ని కథలు గుర్తించదగినవి కాకున్నా క్షమార్హమే! మున్ముందు గొప్ప కథకులు జాబితాలో ఈనాడు గుర్తింపు దొరకని కథకులే కన్పిస్తారు. కృషి ఉన్నచోట ఫలితమూ ఉంటుంది గదా? చివరగా 'రావి శాస్త్రి' గారన్నట్టుగా 'కలం పట్టిన ప్రతి రచయితా తన రచన ఏ మంచికి కీడు చేస్తుందో, ఏ కీడుకు మంచి చేస్తుందో ఆలోచించు కోవాలి' అనుభవం ఆ ఆలోచననిస్తుంది.మంచీ, చెడుల ఘర్షణే జీవితం అయినప్పుడు జీవితాల్ని ఉన్నతీకరించే కార్యసాధకునిగా రచయిత నిబద్ధతతో కృషి చేయాలి!

సాహిత్యాన్ని వృత్తిగా, ప్రవృత్తిగా స్వీకరించిన ప్రతి రచయితా తనున్న సమాజంలోకి చొచ్చుక పోయేలా ఎదగాలి!

హద్దులు లేని ఆకాశమూ సరిహద్దులు లేని సాహిత్యమూ ఒకటే!

**-బి. బాబు**

నాకు నచ్చిన నా కథ

# అంతర్ముఖం

– జాతశ్రీ

ఇంకా తెల్లవారలేదు.

మంచుదట్టంగా కురుస్తోంది.

ముందు వసారాలో కట్టేసి ఉన్న గేదె పాలు పితికిన భూదేవమ్మ ఇంట్లోకి వస్తూ, తాళ్ళు గీయడానికి తయారవుతున్న భర్తను చూస్తూ "కాస్తాగు, టీ పెడత... తాగి పోదువుగాని" అంటూ పొయ్యి దగ్గరకు పోయింది.

అప్పటికే బిల్లగోచిపై పట్టాబిగించి, ముస్తాదు కట్టుకొన్నాడు మల్లేశం, "జల్దికానియ్" అంటూ, చిరతబద్ద అందుకొని నులక మంచం మీద కూచొని ముంజ కొడవలిని సానబడుతూ "ఏమంటున్నడు పెద్దోడు?" అన్నాడు.

"అనేదేముంది... అదే పదం. ఎంత సెప్పినా ఇనుకోవటంలే... ఏ మాట జెప్పినా తిరగ సెపుతుండు. ఒక్కేడు ఓపికపడితే మన కష్టాలన్నీ తీర్తయి అంటున్నడు. సెప్పి, సెప్పీ యాష్టకొస్తాంది" అంది భూదేవమ్మ.

"పట్టు, పట్టుమని యాభయ్యేలు ఎవురిస్తరే... నేనేడ సచ్చేది?" అన్నాడు మల్లేశం.

"ఈడికిదేం మాయరోగవోఁ.... కుయిటు, కుయిటు అని తగిలిండు. ఇవానం ఎప్పుడెక్కుత నని సూస్తాండేగాని, మరో దేస లేదాడికి" అంది భూదేవమ్మ.

"ఏం ఇవానవోఁ.... ఏవోఁ.... ముందు నన్ను పాడెక్కించేలా ఉన్నడు" సానబట్టిన ముంజ కొడవలిని బొటనవ్రేలితో గీరుతూ, పదును జూసి, దాన్ని ప్రక్కనే ఉంచి, గీసకత్తిని అందుకున్నాడు మల్లేశం.

"గీసకత్తికి రేత్తిరే పదునెట్టినవ్ గాదూ?..." టీ గ్లాసుతో భర్త దగ్గరగా వస్తూ అంది భూదేవమ్మ.

"పట్టినలే, తియ్" అంటూ గీసకత్తి పదును జూసి, చిరతబద్దమీద ఓ సారాడించి, పక్కనుంచుతూ, టీ గ్లాసు అందుకొన్నాడు మల్లేశం.

భూదేవమ్మ భర్త కాళ్ళముందు నేలమీద కూచొని, మూడు రోజుల క్రితం తాటి మట్ట గీరుకొని, పెద్ద పుండయిన చోట కుడి చూపుడు వ్రేలితో నెమ్మదిగా నిమురుతూ, "సీవింకా ఉంది, సూదేయించుకొన్నవా?" అంది.

"ఆ... ఇరవై దొబ్బిండు గాదూ డాకటరు" అన్నాడు మల్లేశం.

"అదేంది.... పదేగాదూ!.... నిన్న పొద్దాల ముంజ కొమురన్నకి సూదేసి పదే తీసుకుండుగా... ఎవురి కేసినా అదే సూదాయె... మన్సికో రేటా?..." అంది భూదేవమ్మ.

"ఏవోఁ.... పోనియ్... పిల్లలున్నోళ్ళం. ఎప్పుడు కేకేసినా పరిగెత్తుకొస్తాండు... అయితమాన్లె".

"పున్నేనికొస్తాండా... బరాబర్ పైసలిస్తన్న... నేనడగతానుండు".

"అడక్కు.... ఏ సూదిల ఏ మతలబు ఉందో, మనకేవెఁరక?"

"అంద్కని అడిగినంతిస్తవా?"

"పోనీ అన్నాగా...అరవబాక" అంటూ టీ గ్లాసు అందించి, మంచం లోంచి లేచి చిలక్కొయ్యకున్న కాళ్ళ గుదిని తీసుకొని, ఓసారి లాగి చూసి, మూలనున్న కాడిబద్ద అందుకొన్నాడు మల్లేశం.

"మర్సిన, రేత్రి, సందేళ... మీ తమ్ముడు కోటేశం ఇంటికొచ్చిండు" అంది భూదేవమ్మ.

"ఏందట?"

"పెద్దపిల్ల – అదే, మాలక్ష్మీ సవఁర్తయిందట. ఒకెయ్యి రూపాయలు కావాలన్నడు" అంది భూదేవమ్మ.

"నువ్వేవఁన్నవ్?"

'నిన్నడిగి సెపతనన్న... అప్పుడే ఇద్దావనిపించిది గాని, నీకోమాట సెపితే బాగని ఆగిన..."

"ఇస్తే పొయ్యేదిగా... నాకు సెప్పేదేంది? ఇంట్లో ఉండి గుడ్లేవఁన్న పెడతయా?... అయినోడికీ, ఆపదకీ కాక రూపాయలు మూట కడతవా?.... అన్నా తమ్ముడూ, మంచీ మన్ననా లేక, 'డబ్బో..." అంటు ఎర్రెత్తి పోటానికి మనవేఁవన్న ఈ కాలపోళ్ళవాఁ" అన్నాడు మల్లేశం.

"సర్లే... అట్టనే, నేనే పొయ్యి ఆ పిల్దాని చేతిల రెండు కొబ్బరి కుడకలూ, ఇంత బెల్లం బెట్టి, కోటేశానికి డబ్బులిచ్చొస్త" అంది భూదేవమ్మ.

వసారాలో పందిరి గుంజకు తగిలించి ఉంచిన మోకు అందుకొని, "సూత్తన్నవేంది, లొట్లు దేపో..." అన్నాడు మల్లేశం.



## కథాంతరంగం

ప్రపంచీకరణ ప్రభావంతో అమలవుతున్న స్వేచ్ఛా వాణిజ్య విధానాలు భారతీయ గ్రామీణ వ్యవస్థను కలుషితం చేస్తున్నాయి. తరతరాలుగా జీవనాధారంగా ఉంటున్న చేతివృత్తులను ధ్వంసం చేస్తూ, అమాయక పల్లీయులు తమ జీవితాలను కోల్పోయేలా చేస్తున్నాయి.

అగ్రరాజ్యాల పారిశ్రామిక ప్రగతిని నిర్లజ్జగా తలకెత్తుకొన్న మన ధన సామ్య నేతల ఆలోచనా ధోరణి వల్ల జనం వస్తు వ్యామోహ వెల్లువలో, డబ్బే సర్వస్వంగా వికృత పోకడలతో సాగే ఆధునిక గ్రామీణ అపరిపక్వ ధోరణిని ప్రతిబింబించిన కథ!

మనం రాసే కథల్లో జీవితం ఉంటే జనంలో చలనం ఎగిసిపడుతుందనే నా నమ్మకాన్ని నిలబెట్టిన కథ ఇది. నాకు నచ్చిన నా మంచి కథల్లో ఇది ఒకటి.

– జాతశ్రీ

**9396798165**

''నా మతిమండ... ఏందో, గీ పోరగాడు సెయ్యబట్టి మతిల మతి ఉండటంలే..'' అంటూ, ఇంటి వెనుక నీళ్ళగాబు దగ్గరున్న లొట్లు కడిగి, తీసుకొచ్చి అందించింది భూదేవమ్మ.

వాటినందుకొని మల్లేశం, కావిడి బద్దకు తగిలించుకొంటుంటే, భర్త వీపున చెయ్యానిస్తూ, ''జాగర్త, మంచు కురుస్తాంది'' అందే భూదేవమ్మ.

''నా జాగర్తకేం గాని, ఆ పెద్దోడినే కాస్త అర్సుకో'' అన్నాడు మల్లేశం.

''అవ్‌గానీ, రాజెన్నేవఁన్నడు?'' అంది భూదేవమ్మ.

''సంక్రాంతెల్లినాక ఏ సంగతి సెపుతనన్నడు. గవొర్నమెంటు సుత దివాలెత్తిందంట. పోయినేడు బకాయిలన్నీ కట్టందే కొత్త లోన్లియ్యొద్దని సెంద్రబాబు ఆర్డరేసిండంట'' అన్నాడు మల్లేశం.

''ఏవాఁయె... పేదోళ్ళు బతకొంద్దంటనా?.... అయినా మనం పూరా గట్టినం గాదూ?'' అంది భూదేవమ్మ.

''మనం గడితె – సరిపోద్దా... సొసైటి మెంబర్లంత కట్టొద్దా... అయ్యన్నీ సెక్రటి బేంకుల జమ చేయ్యొద్దా... ఆ లెక్కలన్నీ తేలాక, అప్పుడు మళ్ళీ కొత్తప్పులకి అర్జీ పెట్టుకోవఁని సాటింపేస్తరు ఎరుకయిందా?'' అన్నాడు మల్లేశం.

''ప్చ్, ఏందో ఈ శెరలు. ఈ మాయదారి పోరగాడతో మా సిరాగ్గుంది. ముద్ద మింగుడు పడనియ్యటంలే... ఒహటే... నస... రెండెకరాలు అమ్మదావంటడు'' అంది భూదేవమ్మ.

మల్లేశం ఉలిక్కిపడ్డాడు. నోరు పడిపోయిన వానిలా ఓ క్షణం తేలగుడ్లేసి, భార్యకేసి చూస్తూ ''ఏందీ.... పొలం అమ్ముతడంటనా... అమ్మి ఏంజేస్తడంట?'' అన్నాడు.

''ఏడాది తిరక్కుండానే నాలుగెకరాలు కొంటడంట''.


''మా కొంటడు. వాడి ఏశాలు తెల్వదనుకుంటుండేవో... సదువు రానోళ్ళవఁని మా ఆడిస్తండు. అరె, ఈ పోర్గాడు జెయ్యబట్టె గద, ఆ కొత్తగూడెం టీవోడు ఇంటిమీద బడి పరువుదీస్తండు. వాయిదాల సొమ్మొద్దురాంటే ఇని సచ్చిండా... అది తడిసి మోపెడయింది. అయ్యగారికి టి.వి. లేకుంటే పొద్దుబోదేవోఁ.... నెలకు పదేసొందలు యాడనుంచి దెస్త'' అన్నాడు మల్లేశం చిరుకోపంతో. .

''అయితే మాన్లె తియ్‌.... ఊరంతా తీసుకొంటుంటే ఆడూ కాయిశు పడ్డడు. అప్పుల అప్పు... ఇంకేంది?.... మూడాయిదాలు కడితే తీరిపోద్ది'' సముదాయింపుగా అంది భూదేవమ్మ.

''శాన జెప్పినవ్‌లే, ఇగాగు... అరె. అటు పెద్దాని పెళ్ళి బాకీ సంగతి జూడల్నా... అదో బిడ్డ తల్లయినా దానికిస్తనన్న ఇరవయ్యేలూ సర్దలేక సస్తుంటే... వాడికి తెల్వదా?...'' వాడేవఁన్న పాల్దాగుతుండా... ఇగ్గో వాడితో జెప్పు, ఒహటేమాట... కాలం బాగుంటే, కలిసొస్తే పత్తిడబ్బు లొచ్చినంక పొమ్మను. ఇప్పుడిప్పుడే కావాలంటే నే కాటికి పోటం తప్ప దారేదీ దొరకటంలే... అరె, తోటోడు తొడ గోసుకొండని మనం మెడగోసు కొందావఁ.... సదూకున్నోడేవోఁ.... ఆ మాత్రం తెల్వదా ఆడికి?...'' అన్నాడు మల్లేశం.

''నే జెపుతలే. నువ్వు గుండె జెదరమాకు'' అంది భూదేవమ్మ.

మల్లేశం లోలోనే మరేదో గొణుక్కొంటూ, కావిడి బద్ద బుజానుంచుకొని, ఓ పక్క మోకు తగిలించాడు. వసారాలో ఉన్న చెప్పులేసుకొని, ''పోయొస్త' అంటూ ఇల్లు దాటాడు.



వీధి వాకిళ్ళల్లో ఊడుస్తూ... కళ్ళాపి జల్లుతో... ముగ్గులేస్తూ... అమ్మలక్కలు పనులు చేసుకుంటున్నారు. తాళ్ళవనానికి బయల్దేరిన ఐదారుగురు 'గౌడ'లు పాఠశాల ముందు రోడ్డు మీద ఏవో మంతనాలు చేస్తున్నారు. వాళ్ళను చూసేసరికి మల్లేశానికి తాడిశిస్తు కట్టాల్సిన విషయం గుర్తొచ్చింది. శిస్తు డబ్బులు తీసి పక్కన బెట్టాడు గాని, నాల్రోజులు నుంచి పెద్దోడి గోలకి ఏదీ గుర్తుండటం లేదు. ''రేపు కడదాంలే తియ్‌'' అని తనకి తానే చెప్పుకొని ముందుకు సాగాడు.

కొత్త మామ్లు కాగానే తాళ్ళ శిస్తు వసూళ్ళు మొదలుపెట్టడం చాలా మందికి కాస్త ఇబ్బందిగానే ఉంటూంది. అదే సమయంలో పిల్లల అవసరాలూ నెత్తినపడతాయి. స్కూల్ డ్రస్‌లూ, బస్‌పాస్‌లూ, పుస్తకాలూ... అన్నీ ఒకేసారి సర్దాలంటే, కులవృత్తికి తోడు కాస్త వ్యవసాయం ఉన్నవాళ్ల పరిస్థితి ఫర్వాలేదు గాని, అచ్చంగా కల్లు మీదనే

ఖర్చులన్నీ తీరాలంటే కష్టంగానే ఉంటుంది. ఎంత కాదనుకున్నా మూడు నాలుగు వేలు అప్పు పడటం తప్పదు. సీజను వచ్చేదాకా వడ్డీ కట్టడమూ తప్పదు.

మల్లేశం కులవృత్తిపైనే ఆధారపడినవాడేం గాదు, పిత్రార్జితం మూడెకరాల మాగాణీ, నాలుగెకరాల నల్లరేగడి చెలకా ఉంది. కులపోళ్ళు అతన్ని ఉన్నోళ్ళ సరసనే లెక్కిస్తారు. అయితే గత ఐదారేళ్ళ నుంచీ అతనికి వ్యవసాయంలో కలిసి రావడం లేదు. ఊరి చెరువు అలుగెల్లితే రెండు పంటలకు ఢోకా వుండదు. ఎంత లేదన్నా డెబ్బయి, ఎనభై బస్తాల వడ్లు ఇంటికి చేరతాయి. ఎరువులూ, పురుగు మందులూ ఇతర ఖర్చులు పోను, అటు ఏడాది తిండి ధాన్యమూ, చేతిలో పాతికవేలూ కనబడే పరిస్థితి లోంచి... క్రమంగా కష్టపడీ, నెత్తిన చెంగేసుకొని నీరసంతో ఇంటికి చేరే దుస్థితిలోకి దిగజారాడు.

తోడుగా – ఈ మధ్య రైతుల్ని దగాచేసే దళారులు ఎక్కువయ్యారు. గత సంవత్సరం పదహారు క్వింటాళ్ళ పత్తి గుంటూరు మిల్లు కెత్తితే, వాడు తిరగొచ్చిందీ లేదు. పత్తి డబ్బులిచ్చిందీ లేదు. అదేమని నలుగురైదుగురు కలిసి అడిగేందుకు పోతే ఇచ్చిన రశీదులు దొంగవని బెదరగొట్టారు. పోలీసు కేసు పెట్టడం జరిగింది, గాని కొన్న మనిషే కనిపించటం లేదు.

రోజుల్ని చూస్తుంటే మల్లేశానికి అయోమయంగా ఉంది. ఎందుకు, ఎలా జరుగుతుందో అతనికి తెలిసి రావడం లేదుగానీ, రోజు రోజుకీ ఖర్చులు బాగా పెరిగిపోతున్నాయి. అదే తిండి, అదే బట్ట, అదే పూరిల్లు, కొత్తగా ఒరిగొచ్చిందేమీ లేకున్నా, సంపాదనంతా లెక్కకు దొరక్కుండానే పోతోంది. పది రూపాయలు వెనకేద్దామంటే వల్లగావడం లేదు. ఎరువుల కొట్లో, బట్టలకొట్లో అప్పులు అలానే వున్నాయి. ప్రతి ఉగాదికీ అప్పులన్నీ తీర్చేసి, కొత్త ఖాతా రాయించుకునే మల్లేశం, రెండేళ్ళ నుంచీ పాత అప్పుకే వడ్డీ కలిపి, కొత్త ఖాతా తెరవడం బాధగా ఉంది. ఐ.టి.ఐ. చదివిన పెద్దోడు రికంగా తిరగడం కూడా అతనికి తలనొప్పిగా ఉంది. తెలివిన బతుకుతాడని చదివించిన చదువుతో, వాడికి 'బతుకు తెలివి' తప్ప మిగతా 'అతి తెలివి' ఎక్కువైంది.

''చదివితే కులవృత్తి చేయకూడదా?.... నాగలి పట్టకూడదా?... కూచొని సంపాయించే ఉద్యోగమెవడిస్తాడు? పని చేసుకుంటూ బతకడం నామోషీ అయితే ఎలా?.... రోజులు మారినాయని చెప్తాడే తప్ప, వాటితోపాటు తనూ మారాలనీ తెలీదా?'' అనుకొన్నాడు మల్లేశం.

మల్లేశానికి కొడుకు ఏ విధంగానూ కొరుకుడు పడటం లేదు. గత రెండేళ్ళు సింగరేణి కొలువంటూ కొత్తగూడెం కంపెనీ ఆఫీసుల చుట్టూ, యూనియన్ నాయకుల చుట్టూ తిరిగి ఇరవై వేల దాకా పాడు చేశాడు. ఇప్పుడా ఆశ వదులుకొని 'కువైట్' అంటూ కొత్తరాగం ఎత్తుకోవడంతో ఏం చేయడానికీ తోచడం లేదు. 'ఓ యాభై వేలు ఇవ్వండి. ఏడాది తిరక్కుండానే లక్షలు తెస్తానంటూ చిటికలేస్తున్నాడు. కాదు, కూడదంటే, ఏడుపులూ, పెడబొబ్బలు, అలగడం, అరవడం... ఇంటిని రావణకాష్టం చేస్తున్నాడు.

వాడు తెచ్చే లక్షలేమో గాని, ముందా అరలక్ష ఎలా సర్దాలో మల్లేశానికి దారి దొరకడం లేదు, ఇంకా ముగ్గురాడపిల్లలు. చిన్నోళ్ళేగాని రేపో మాపో వాళ్ళూ గుండెల మీది కుంపట్లే గద! ఎంత బికారోడ్ని చూసినా అధమం అర లక్ష అడగక మానరనే ఆలోచనల్లో మల్లేశానికి అదో భయం కూడా గుండెల్లో గూడు చేసుకుంటూంది.

మల్లేశం వీధి మూల మలుపు తిరిగి నారందాసు ఇంటి దాపుకొచ్చేసరికి ఎదురింటి ఈతాకులు తులిసెమ్మ నురగతో నిండిన కల్లుబింకీ ఇంట్లోంచి తెచ్చి కల్లు కాలువలో పారబోస్తూ కనిపించింది.

ఆ దృశ్యం అతని గుండెల్లో బాణంలా గుచ్చుకుంది. ''ప్చ్... ఎంత లేదన్నా, చెడమ్ముకున్నా రెండొందలు.. ఏం సుఖం, నేల పాలాయె! ఇంకా గవుండ్లోడికి బతుకెక్కడిది?...'' అనుకుంటూ తులిసెమ్మ దాపుగా వచ్చి, ''ఏం తులిసెక్కా... కల్లు పులిసిందా, పారబోస్తన్నవ్.'' అన్నాడు.

తలెత్తి చూసిన తులిసెమ్మ, ''ఎవరూ, మల్లేశవా.... నీకు తెలవందే వుంద్రా తమ్ముడూ, కల్లు పులిసిపోవడం తప్ప ఖర్చయ్యే రోజులు మాయమయితున్నయి గదురా.... మాయదారి కోకాకోలా తెచ్చి పెట్టిండుగా కోవఁటి నర్సింహ....పదితో తెల్లారిపోతుంటే పాతిక పెట్టేదెవ్డ్రా?.......'' కల్లు బింకీలో మిగిలిన నురగంతా చేత్తో తీసి పడేస్తూ అంది తులిసెమ్మ.



మల్లేశం తలాడించాడే తప్ప నోరాడించలేదు.

అతనికి మరింత దగ్గరగా వచ్చిన తులిసెమ్మ చిన్న స్వరంతో,, ''అవ్రా తమ్ముడా... బండోళ్ళు ఎంకన్న పెళ్ళానికి డబ్బు లొచ్చినయటగా?'' అంది అదో రహస్యంలా.

''తెల్వదక్కా''.

''నీ మొహం, వచ్చి నాల్రోజుల పైన్నే అయిందట... ఖర్చులన్నీ పోను ఎనభయ్యేలు ఇచ్చినంట్ర''.

''ఎన్నిచ్చినా ఎంకన్న బతికొస్తాడాక్కా.... దాని ముగ్గురు బిడ్డల్ని సాగనంపడానికి ఆ పోర్ది ఎన్ని శెరలు పడాల్నో....''

''ఇంకేం శెరలురా... మొగుడు లేడనేగాని, దాని బతుక్కుదిగులేం ఉండదు. ఆ డబ్బుల్తోటి పిల్లల్ని సాగనంపుద్ది. వాడుండి సెయ్యలేని పెళ్ళిళ్ళు, మన్నయి జేస్తండు గాదురా?.... ఇన్నాళ్ళు రాని సంబంధాలు ఇగొస్తయి చూడు... మూతొంకర, ముక్కుపొడుగు అన్నోళ్ళే పిల్ల నచ్చిందని ఎంట పడతర్రా.... మాయదారి కాలం... ఇయ్యాల్రేపు మనిషున్నా, లేకున్నా డబ్బు... డబ్బుం డాల్రా...'' అంది తులిసెమ్మ.

''ఏదో బతకనియ్'' అంటు పొద్దుకేసి చూసి, ''పోయ్యొస్తక్కా...'' అంటూ

కాలాడించిన మల్లేశానికి మదిలో బండి వెంకన్న కదిలాడు.

బండి వెంకన్న పూటకు పెద్దఉన్నోడేం కాకపోయినా మాటకు మనిషనిపించుకొన్నాడు. వయసు చిన్నదయినా వ్యవహారానికి దిట్ట. చురుకుదనం పాలెక్కువ, అందుకని గీత కార్మిక సహకార సంఘం బాధ్యతలూ, అప్పు వాయిదాల వసూళ్ళు అన్నీ అతనికే అప్పగించారు. కుల పంచాయితీల్లో న్యాయం ప్రక్కన తప్పు, ఎదుటిప్రక్కన ఎంత పోసినా నిలబడేరకం కాదు. అటువంటి వెంకన్న నాలుగు నెలల క్రితం పరుపుతాళ్ళు అడుగు బట్టి, తాటి మట్టల్లోంచి గెలని బయటికు తీస్తుంటే, మట్టల సందుల్లో చేరిన మండ్రగబ్బ కాటేసింది. వెంకన్న గోస పెడుతూ తాడిమీద నుంచి దొర్లిపడ్డాడు. అదిగో, ఇదిగో అంటుంటేనే ప్రాణం పోయింది. ప్రభుత్వం నుంచి నష్టపరిహారంగా లక్ష రూపాయలు వస్తే రావొచ్చుగాని, తాటి వనానికి పోయిన 'గౌడు' ఇంటికి చేరే నమ్మకం లేకుంటే ఇంకెందుకా బతుకు? నష్టపరిహారాల కోసమేనా ఈ వృత్తులు ఆలోచనలతో మల్లేశం మనసు చిందరవందరై పోతోంది. చిరాగ్గా ఉంది. గుండె బరువుగా ఉంది. ఊర్పు - నిట్టూర్పుగా మారింది.

తాళ్ళవనం దాపుగా వచ్చేసరికి అప్పటికే చెట్టెక్కి ఫలసాయాన్ని చూసుకొంటూ వస్తున్న కొర్ర రాములు ''మావాఁ.... కాలు జాగర్త. కాళ్ళగుది గట్టిగ సూసుకో. మంచుకి చెట్టు పూరాగా తడిసింది'' అన్నాడు

మల్లేశానికి నవ్వొచ్చింది. కాని నవ్వలేకపోయాడు. చాలా రోజులుగా, బహుశా నాలుగయిదు సంవత్సరాలుగా అతనిలో నవ్వు మాయమైంది. ఎంత ప్రయత్నించినా ఏదో చిన్నపాటి చిరునవ్వే తప్ప గుండెల్లో రక్తం కదిలేలా నవ్వక చాలాకాలమైంది. ''తాతకు దగ్గులు నేర్పు తున్నావురా?...'' అంటు మరింత దగ్గరగా వచ్చి, ''రేయ్, రామూ, నీ సావాసగాడేగా... మా ఓడికి నువ్వన్నా సెప్పరాదురా... కుయిట్, కుయిట్ అని గోస పెడతుండు'' అన్నాడు మల్లేశం.

''అవ్ మావాఁ ఎప్పుడు పొయ్యేది?''

''ఎగసికం గున్నాదిరా... కుయిట్ పోటవంటే మాట్లా... యాభై ఏలు. కావాల్రా... యాడ దొబ్బకొచ్చేది''

''డబ్బే కట్టలేదా... మరి మీవోడు నెలాఖర్న యివాఁనం ఎక్కుతనని నిన్న సుత నాతో అన్నడు. వాడు పోవాల గాని నీకు డబ్బులే... డబ్బులు'' అని పెదాలపై నవ్వాడించాడు రాములు.

''తాలసె... ఎదవ డబ్బు... డబ్బులుంటే బతికినావ్రా ఇంతకాలం?....

---

కవిత

# ఇంటూ నలభై



ఇంటూ నలభైల జీవితం కోసం వేనవేల మైళ్ళు
కొండలుకోనలు, సప్త సముద్రాలు దాటుతాం-
గంటల పనికి - గంటకింత-
బతుకుపోరాటంలో సం.రాల తరబడి ప్రవాసం
నీతో సంభాషించేదెవరు?
నీతో పంచుకునేదెవరు?
నీతో గమ్యం చేరేదెవరు?
కదిపే ప్రతి అడుగు ముందూ ఇంటూ నలభై భూతం ప్రత్యక్షమవుతుంది
రూపాయిల్లో తర్జుమా అయ్యే ప్రతి అంకె భూతద్దంలో కనిపించి వణుకు పుట్టిస్తుంది
ఇంటద్దె యాభైవేల పైచిలుకు
వెయ్యికి రాని పదికేజీల బియ్యం
కూరలు బుట్టెడు రెండు వేలు
బస్సెక్కి దిగితే వంద
వేలెడంత కొత్తిమీర, కరివేపాకు రెండు వందలు
పది రూపాయలకో గుడ్డు -
నూటేభైకే రాని బ్రెడ్డు-
ఇంటూ నలభైల జీవనంలో ఐస్క్రీం తినడమా?
సినిమాల కెళ్ళడమా?
పక్క వాటాలో ఎవరుంటారు తెలీదు-
ఎవరి భాష ఎవరికీ రాదు-
ఇంగ్లీషు దారం కుట్టుకుని ఎన్ని ముళ్ళని వేసుకుంటాం?
ఒకేలాంటి చెక్కగూళ్ళలో బడో, గుడో తెలీదు-
మైళ్ళకు మైళ్ళు ప్రయాణించినా ప్రాంతాల తేడా వుండదు
ఇంటూ నలభైల జీవనంలో
భార్యా భర్తా - పిల్లజెల్లా - ఇల్లూ కుటుంబం శనాదివారాలకు పరిమితం
స్నేహాలు, సంతోషాలు, పార్టీలు, షికార్లు
వేడివేడిగా టిఫిన్లు, భోజనాలు అన్నీ వారాంతాలే
అక్కడ ఊర్లో ఏమైందో-
అమ్మా నాన్నా ఎలా ఉన్నారో-
అందర్నీ చూసి ఎన్నాళ్ళైందో
అయినా అవన్నీ ఇప్పుడు నాలుగు పక్కన సున్నాతో సమానం
నలభైల్లో వచ్చే దాని ముందు అవన్నీ ఎంత?!
టాక్సు మూడో వంతు పోయినా
ఇన్సూరెన్సులు సగం మింగేసినా
నెలంతా గడిస్తే నాలుగో వంతే మిగిలినా
'అమెరికాలో వుండడమే' పెద్ద ఎస్సెట్టు-
ఇంటికో ఎన్నారై కావడమే ఇప్పటి టార్గెట్టు-
ఇంటూ నలభైల కోసం కలల్ని దాటి
కల్లోలాల్ని దాటి
దూరాంతరాల్లో త్యాగాల్ని దాటి
ప్రవహించి వస్తాం-
తీరా-
ఉగాది పచ్చడిలో వేప పువ్వుండదు
వినాయక చవితికి నిమజ్జనముండదు
దీపావళికి ఆకాశంలో చుక్కలు లెక్కట్టాల్సిందే
కాల్చాల్సిన క్రేకర్లన్నీ ఎవరిదో జూలై నాలుగులో రాల్చాల్సిందే-
నువ్వు దుఃఖిస్తే హత్తుకోవడానికి చలొక్కటుంటుంది
దిగులు పడితే గుండె నిబ్బర పర్చడానికి గాలొక్కటుంటుంది
గంభీరంగా నిల్చునే గడ్డి కొండలూ
మేఘాలు ముసిరిన మంచు ఉదయాలూ
నిట్రాటల్లా నిల్చున్న రెడ్ వుడ్ చెట్లు
రంగు రంగుల పుష్ప విన్యాసాలూ వుంటాయి
డబ్బు దండిగా పిండి విలాసాలు రాల్చే మాల్‌లు
ఎట్నించెటో తీసుకెళ్ళే పాశ్చాత్య పోకడలూ వుంటాయి
ఇంటూ నలభై లో
క్షణక్షణం - ప్రవాస బతుకుపోరాటంలో
నీతో సంభాషించేదెవరు?
నీతో పంచుకునేదెవరు?
నీతో గమ్యం చేరేదెవరు?
నీతో ఆగకుండా ప్రయాణించేదెవరు?
నీ వెన్ను నిమిరేదెవరు?
నిన్ను ప్రేమించేదెవరు?
చివరికి మిగిలేదెవరు?
నువ్వు ఇంటూ నలభై
నలభై ఇంటూ నువ్వు

-కె.గీత

ఈ మద్దేనొచ్చిందీ డబ్బురోగం'' అన్నాడు మల్లేశం.

''ఎనకటి ఊసెందుకులే మావా.. ఆ రోజులన్నీ ఇహ కథలే... అప్పటి పల కరింపులూ, రుచులూ ఇప్పుడున్నయా?... బుద్దులు పూరాగా మారి పోతు న్నయి గద మావా....'' అన్నాడు రాములు.

''అవ్ రా... పురుగు మందుల పంట తింటున్నం గాదూ?... మనిషికీ పురుగు బుద్దొస్తాంది'' మల్లేశం అన్నాడు.

''సత్తెం జెప్పినావ్ మావా... ఇయ్యాల్రేపూ డబ్బులున్నోడే మనిషి, లేనోడు పురుగుతో జమ''.

''అవ్ రా, రామూ, నాకు తెల్వటంలే... పుట్టిన గడ్డా, కనిపెంచిన తల్లిదండ్రీ లేకుంట యాడనో బతకడం కూడా ఓ బతుకేనారా! కలో గంజో తాగి కలిసి బత కాలని సెప్పిన్రుగాదుర పెద్దోళ్ళు. జంతువుల్లాగ ఎవుడి కాడు బతకడం, మూట గట్టుగోవడం మన్సి బతుకెట్టయిద్దిరా..'' తల గోక్కుంటూ అన్నాడు మల్లేశం.

''పోయినాయ్ మావా.... ఆరోజులన్నీ పోయినయ్, ఇయ్యాల్రేపు డబ్బులే లోకం. తల్లేగానీ, చెల్లేగానీ డబ్బుతనే కొలుస్తున్రు... వాడదురుష్టం ఎట్టుందో, ఎట్టనన్నజేసి పంపియ్యి మావా... కాదంటే ఒరిగేదేవన్న ఉందా? అన్నాడు రాములు.

''అంతేనంటావా?''

రాములు తలూపుతూ దాటిపోయాడు.

మల్లేశం దాటిపోతున్న రాముల్ని చూస్తూ అలాగనే నిల్చుండిపోయాడు. కొద్దిసేపటికి తెలివొచ్చినట్టుగా, తత్తరపాటుతో ''ఏందీ... ఏందీ మాయ?... ఇంత వయసొచ్చి, నాకొడుకంతోడితో జెప్పించుకొన్న, నా బుద్దేవఁయింది?'' అనుకుంటూ తాటిచెట్టు దగ్గరగా చేరాడు.

మల్లేశం మనసు పరి పరివిధాల, వెనక్కీ ముందుకీ, కుడికీ ఎడమకీ పరిగెడు తుంది. తన బతుకులోకి చూసుకొన్నాడు. అప్పులన్నీ నోటికి లెక్కేశాడు. నలభై వేలు లెక్కకొచ్చాయి. రోజులు చూస్తే ఖర్చులు తప్ప రాబడి అరుదైపోయింది. భూమి నిస్సారమై పోతుంది. గాడిద మబ్బులు తప్ప వాన మబ్బులు కరువైపో యాయి. ఇటుజూస్తే నిఖార్సయిన కల్లుకు నూకలు దొరకడం లేదు. దూబ గుంట కల్తీ కల్లూ, నల్లబెల్లం దొంగ గుడుంబా కలిసి గౌండ్ల బతుకుల్ని వెక్కిరిస్తు న్నాయి. ఏదో ఒక రాబడి... రాబడి ఉండాలంటే పెట్టుబడి ఉండాల. పెద్దోడ్ని కుయిట్ పంపిస్తేనే కుదిరేలా ఉంది. పోనీ, వాడదురుష్టం ఎలా ఉందో...

అంతలోనే మరో గుబులు... తెలీనిచోటుకి పిల్లోడ్ని పంపితే కష్టాల పాలౌతా డేమో! అక్కడేదైనా జరిగితే కబురైనా అందదు. అయినా వాడడిగిన డబ్బు యాడ తెచ్చేది? చెలకమ్ముదామన్నా కొనే వాడెవడు? ఊరిలో డబ్బెవరి కుంది?... పోనీ, వడ్డీకి తెచ్చినా రేపు వాడి గీత బావుండక అప్పు మోపెడై యింటిల్లాదులకి ఏ పురుగులమందో గత యిద్దా యేం?'' అనుకొన్నాడు.

మళ్ళీ అంతలోనే... ''దేశపో.. ఎట్టయినా... మాబాగె... బతికేందుకు రోజూ సచ్చేదానికన్న అదే సుకం. కానియ్'' అనుకొని మల్లేశం కొడుకును కుయిట్ పంపించాలనే నిర్ణయానికి వచ్చాడు.

ఆలోచనలు – డబ్బుదొరికే దారుల్లో సాగుతూ, తనకు నెలవైన వ్యాపా రుల్నీ, ఉద్యోగుల్నీ గుర్తు చేసుకొన్నాడు మల్లేశం. అతని ఆలోచనలకు ఒకరిద్దరు అందినా, అంత డబ్బు ఇవ్వడానికి వెనుకాడ తారేమోననిపించింది.

ఇంతకాలం అడిగి లేదనిపించుకొన్నవాడు కాదు మల్లేశం. మాట తప్పని రైతుగా మంచి పేరుందతనికి. ఇంతకాలం వ్యవసాయానికి అప్పులిచ్చిన వాళ్ళు గత కొన్నేళ్ళుగా రైతుల్ని పక్కకు నెట్టేసి, వ్యాపారాలకి మదుపు పెడుతు న్నారు. కాదంటే తల కొట్టేసినట్టుందనే ఆలోచనలు ఆరంభ మయ్యాయి. మనసు నిండా టిక్కులూ, రైట్లూ, పిచ్చిగీతలు – తల వేడెక్కుతుంటే, కులదే వుడు – 'కాటమయ్య'ని తల్చుకొంటూ ''సావీ... ఈ గండం గట్టెక్కిస్తే పోతు పిల్లనిస్తా... దయజూడు తండ్రీ...'' అంటూ రెండు చెంపలు వేసుకొన్నాడు.

తాటిచెట్టు మొగదలలో నిలబడి, కావిడిబద్ద దించి, ఓ ప్రక్కగా ఉంచాడు. లొట్టిని ముస్తాదుకున్న కొక్కానికి తగిలించాడు. కత్తుల్ని చేత్తో తడిమి చూసుకొ న్నాడు. పంచెకట్టులో దోపిన చిరతబద్దని తీసి క్రింద పడేసి, మోకందుకొని బుజాల క్రిందుగా నడుం మీదుగా తాటిచెట్టు చుట్టూ తిప్పి కొక్కెం తగిలిం చాడు. లాగి చూశాడు. గట్టిగా పట్టుకుంది.


కాళ్ళగుది అందుకొని, కుడి పాదానికి తగిలించి చెట్టునుతాకి, దండం పెడుతూ చేతి పట్టుతో నాలుగైదు బారలు చెట్టెక్కి కాళ్ళ గుదిలో ఎడమ పాదాన్ని కూడా దూర్చి రెండు పాదాల్ని చెట్టుకు దొప్పలామోపి, కాళ్ళ బిగు వుతో మోకును పైకి నెట్టుకుంటూ, ఉబుకుతూ ఎక్కసాగాడు.

సగం చెట్టు ఎక్కేసరికి ఆయాసమనిపించింది. ఎప్పుడూ ఉండేదే... గౌండ్ల బతుకే అంత. చెట్టుచెట్టుకీ, గస పెట్టందే ఫలసాయం చేతికందదు. ప్రతి రోజూ, ప్రతి చెట్టూ – ముప్పొద్దు – మూడుసార్లు ఎక్కి గెల గీసి లొట్టి మార్చాల్సిందే. నాగాబెడితే కుదరదు. కల్లు బారదు. కల్లు బారకపోతే బతుకు గడవదు.

ఆయాసంతో పాటు మల్లేశంలో ఆలోచనలూ సాగుతున్నాయి. వాడు లక్షలు తెస్తనంటున్నాడు... ఈ దెబ్బతోనన్న పిల్లల బతుకులో దారిన పడతయి. ఫలానోడి పిల్లలు సుకంగున్నారంటే అంతేచాలు..

డబ్బెట్ట... యాభయ్యేలు యాడ దొరుకుతాయ్?... అనుకుంటూ మరో నాలుగుబారెలు సాగేసరికి మల్లేశం మనసులో బండి వెంకన్న బుడగేశాడు. ''ఛస్తేంది, బతికి పీక్కతినేదేవన్నా ఉండేడిస్తేగా... పిల్లల్నో దారిజేసిండు అని నలుగురు అనుకుంటే చాలాదా?.... ఇయ్యాల గాకుంటే రేపన్న బూడిదగాక తప్పుద్దా?... ''అని మనసులోనే అనుకున్నాడు''.

మల్లేశం చెట్టు మొగదల దాకా చేరాడు. చెట్టు ఊగింది. రాత్రి కురిసిన మంచు, ఎండపొడకు నీళ్ళుగా మారింది. చెట్టు కదిలేసరికి నీళ్ళు మట్టల్లోంచి జారి తలపై పడ్డాయి. తల తడిసింది. చల్లదనానికి చెవులు జివ్వుమన్నాయి.




''ఏందో గవుండ్లోడి బతుకు... ఎక్కీ, దిగటవేఁతప్ప ఎదిగొచ్చినోడెవడూ లేడు. తాళ్ళపాట పాడినోడు తప్ప తాళ్ళు గీసినోఁడు బాగయిందీ లేదు. చెట్టు గీసేవోడి కంటే మీంచి పడినోడికే ఇలవ'' అనుకుంటూ గెలకు కట్టిన లొట్టి విప్పుతుంటే తల తిరిగినట్టయింది.

చెట్టు ఊగుతున్నట్టుగా ఉంది. భూమి తిరగబడుతున్నట్టుగా ఉంది. చెట్టు పడిపోతున్నట్టుగా, తను గాల్లో తేలి పోతున్నట్టుగా... మొహం నిండా చెమట!... గుండె గుండెలో... ఎలానో... మంట! తాటిమట్టతో బరబరా కోస్తు న్నట్టుగా – గుండెలో బాధ...!

మల్లేశం తెలివి తెచ్చుకునేందుకు ప్రయత్నించాడు. తనకేదో అవుతుందని పించింది. చెట్టును పట్టుకోవాలనుకొన్నాడు. అందుకు ప్రయత్నం చేసేంత లోనో... అంతలోనే.... మోకు కిందికి జారింది. కాలు వణికింది. క్షణం గడువక ముందే కాళ్ళగుదీ జారిపడింది.

అదే క్షణంలో... కాళ్ళగుదితో పాటే ''పెద్దోడా... కుయిట్... జర, భద్రం కొడకో..'' అంటూ హెచ్చరిస్తున్నట్టుగా భీకరంగా కేకేస్తూ – మల్లేశం!

❑

***(23-03-2003 ఆంధ్రజ్యోతి ఆదివారం అనుబంధం)***